ఏ నోట విన్నా 'ఎల్కతుర్తి' ముచ్చటే..

పల్లెల్లో జోరందుకున్న గులాబీ పండుగ జోష్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 25: గులాబీ పార్టీ పండుగ జోష్.. పల్లెల్లో జోరందుకుంది. ఏనోట విన్నా ఎల్కతుర్తి సభ గురించే ముచ్చట. బీఆర్ఎస్ ఆవిర్భవించి పాతికేళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో పార్టీ రజతోత్సవాన్ని అధినాయకత్వం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా అక్కడ భారీ ఎత్తున సభను ఏర్పాటుచేస్తోంది. అయితే, ఈ సభ జయప్రదం కోసం సుమారు పక్షం రోజులుగా పార్టీ నాయకులు ఊరూరా విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. వీధివీధినా వాల్ పోస్టర్లు అంటించారు. వాడవాడలా వాల్ రైటింగ్‌లు రాశారు. పల్లెపల్లెనా పార్టీ దిమ్మెలను రంగులద్దుతున్నారు. ఇక, ఇప్పటికే పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సహా ముఖ్య నేతలందరూ రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. మరోవైపు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మరింత జోష్ మీద ఉన్నారు. 'ఎల్కతుర్తి సభకు ఎప్పుడు వెళ్దామా? ఉద్యమసారథిని ఎప్పుడు చూద్దామా? అభిమాన నేత ప్రసంగాన్ని ఎప్పుడు తనివితీరా విందామా?' అనుకుంటూ ఆతృతతో ఉన్నారు. ఈ వాతావరణం ఖమ్మం రూరల్ మండలంలో స్పష్టంగా కన్పిస్తోంది. పంచాయతీ కార్మికుడి నుంచి మొదలుకొని పండుముసలి వరకూ, అన్నదాతల నుంచి మొదలుకొని ఆసరా లబ్ధిదారుల వరకూ అందరూ రజతోత్సవ సభ కోసమే ఎదురుచూస్తున్నారు. దాదాపు 18 నెలల తరువాత గులాబీ శ్రేణుల్లో ఒక్కసారిగా కొత్త ఉత్తేజం కలుగుతోంది. కాగా, రజతోత్సవ పండుగకు 48 గంటల వ్యవధి మాత్రమే ఉండడంతో కార్యకర్తల తరలింపు, వాహనాల ఏర్పాట్లలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సహా పార్టీ ముఖ్య నేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

పాన్నెకల్లులో పార్టీ దిమ్మెకు రంగులు అద్దుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు

20 రోజులైనా కాంటాలు జరగకపోవడంతో రైతుల ఆందోళన

వరి రాశుల వద్ద పడిగాపులు కాస్తూ ఆవేదన వ్యక్తంచేస్తున్న అన్నదాతలు

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 25 : కొనుగోలు కేంద్రాల్లో 20 రోజులైనా ధాన్యం కాంటాలు పెట్టకపోవడంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. తిరుమలాయపాలెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో జల్లేపల్లి, వెదుళ్ల చెరువు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 138 మంది రైతులు 8,053 క్వింటాళ్ల ధాన్యాన్ని అమ్మకానికి తెచ్చారు. ధాన్యం తెచ్చి 20 రోజులు కావస్తున్నా ఇంతవరకు కాంటాలు కాలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. టోకెన్లు ఇచ్చినప్పటికి మిల్లర్లకు కేటాయింపులు జరగకపోవడంతో కాంటాలు కావడం లేదు. వడ్లు నాణ్యతలా లేవని, తూర్పాల పేరుతో పుట్టి వడ్లకు రైతుల నుంచి రూ.250 ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. క్వింటాకు మూడు నుంచి ఐదు కేజీల తరుగు తీస్తున్నారు. వడ్లు లారీకి లోడు చేసినందుకు క్వింటాకు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్ల దగా, కొర్రీల కష్టాలను తట్టుకోలేక అన్నదాతలు దళారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించి నష్టపోతున్నారు. తిరుమలాయపాలెం, హైదర్‌సాయిపేట, దమ్మాయిగూడెం, మేడిదపల్లి, బీరోలు, సుబ్లేడు, కాకరవాయి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. వెంటనే కొనుగోళ్లు చేపట్టి తమకు న్యాయం చేయాలని ధాన్యం తరలించిన రైతులు కోరుతున్నారు.

ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

సీపీ సునీల్ దత్

కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 25 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఆచార్లగూడెం ఐకేపీ సెంటర్‌ను, రాజేశ్వరపురం మిల్లును శుక్రవారం సందర్శించిన ఆయన ధాన్యం తరలించిన రైతులను, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తేమ శాతం నిబంధనల ప్రకారం వచ్చే అవకాశం ఉన్నదని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దీనిని గుర్తించాలన్నారు. మిల్లర్లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఆలస్యం కాకుండా చూడాలన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తంబూరి దయాకర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సీఐ సంజీవ్, ఎస్సై సంతోశ్, నెల్లూరి భద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

ధాన్యంతో ముప్పై రెండు రోజులు!

విసుగెత్తి సూర్యాపేట మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయం

పెట్టుబడి, అద్దె డబ్బులు కూడా రాలేదని రైతుల ఆవేదన

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 25 : 32 రోజులు పడిగాపులు కాసినా ధాన్యం దిగుమతి కాకపోవడంతో విసుగు చెందిన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల అద్దె వెచ్చించి సూర్యాపేట మార్కెట్‌కు తరలించి తక్కువ ధరకు తెగనమ్ముకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కిష్టాపురం ఐకేపీ కేంద్రంలో నెల రోజుల క్రితం ధాన్యం పోశారు. ఈ నెల 23న కాంటాలు పూర్తయి క్వింటా రూ.2,300 ధర పలికింది. కాంటా అయిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు పంపించాల్సి ఉండగా.. మిల్లు యజమాని లారీలు పంపించకపోవడంతో కొనుగోలు కేంద్రంలోనే బస్తాలు నిలిచిపోయాయి. దీంతో రైతులే తమ సొంత ఖర్చులతో ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలను నేలకొండపల్లిలోని పద్మావతి మిల్లుకు తరలించారు. మిల్లు యజమాని లారీల్లో వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసిన తర్వాతే ట్రాక్టర్లలోని ధాన్యాన్ని దిగుమతి చేస్తామనడంతో రెండు రోజులపాటు మిల్లు వద్దే నిరీక్షించారు. అయినా దిగుమతి చేసుకోకపోవడంతో ట్రాక్టర్ కిరాయి రోజుకు రూ.5 వేలు అవుతుందని, చేసేది లేక సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకొచ్చారు. అక్కడ క్వింటాకు రూ.1,980 ధర పలికింది. కనీసం పెట్టుబడులు, కిరాయిలు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గోస పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఒప్పంద పత్రం రాసిస్తేనే తాళి కడతా..!

వరుడి కోరికతో చివరి క్షణంలో ఆగిన పెళ్లి

రెండు రోజుల తర్వాత సుఖాంతమైన కథ

కూసుమంచి, ఏప్రిల్ 25 : పెద్దలు పెళ్లి కుదిర్చిన రోజు అనుకున్న మాట ప్రకారం అన్నీ రాతపూర్వకంగా ఇవ్వాలని.. అప్పుడే తాళి కడతానని వరుడు భీష్మించడంతో పీటలపై పెళ్లి ఆగిపోయింది. మళ్లీ రెండు రోజుల విరామం తర్వాత పెళ్లికి ఒప్పుకోవడంతో కథ సుఖాంతమైంది. ఈ ఘటన కూసుమంచి మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. మండలానికి చెందిన వరుడు, వధువుకు పెద్దలు పెళ్లి నిశ్చయం చేయడంతో గత ఏప్రిల్ నెలలో నిశ్చితార్థం జరిగింది. కట్నకానుకలు, ఇతరత్రా వ్యవహారాలన్నీ పెద్దల సమక్షంలోనే మాట్లాడుకున్నారు. అయితే ఈ నెల 23న ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి సన్నిధిలో పెళ్లికి ముహూర్తం కుదుర్చుకున్నారు. వివాహ తంతు షురూ.. కావడం.. తాళిబొట్టు కట్టే సమయంలో వరుడు తనకు రావల్సిన కట్నకానుకలన్నీ పేపర్‌పై రాసివ్వాలని, లేదంటే తాళి కట్టేది లేదని పట్టుబట్టాడు. దీంతో పెళ్లికి వచ్చిన వారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. చివరికి కూసుమంచి పోలీస్‌స్టేషన్‌కు పెళ్లి పంచాయితీ చేరింది. ఇరుపక్షాలు సామరస్యపూర్వకంగా మాట్లాడుకుంటామని ఎస్సైకి తెలియజేశారు. ఎస్సై నాగరాజు చొరవతో శుక్రవారం సమస్యకు పరిష్కారం లభించింది. వరుడు పెళ్లికి ఒప్పుకోవడంతో కథ సుఖాంతమైంది.

యశోద హాస్పిటల్‌లో అరుదైన వైద్యం

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 25 : హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో ఖమ్మానికి చెందిన వ్యక్తికి అరుదైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడామని స్థానిక బ్రాంచ్ డాక్టర్ విశ్వేశ్వరరావు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడునెలల క్రితం ఖమ్మానికి చెందిన వెంకటరాములు అనే పేషెంట్ కడుపులో రక్తం వచ్చి సీరియస్ కండిషన్‌లో సోమాజిగూడ యశోద ఆసుపత్రికి వచ్చి తమను సంప్రదించారని చెప్పారు. వెంటనే అతడికి ప్రోపోస్కోప్ టెస్టింగ్ నిర్వహించామన్నారు. ఎంతో అడ్వాన్స్‌డ్ వైద్య పరీక్ష అని, కడుపులో రక్తం వస్తున్న ప్రాంతాన్ని గుర్తిస్తుందన్నారు. రోగికి ఆటో యూమీ నుంచి రక్తం వచ్చినట్లు తెలుసుకున్నామని, కోటి మందిలో ఒకరికి ఈ విధమైన సమస్య తలెత్తుతుందన్నారు. చాలామంది దగ్గు వచ్చినప్పుడు నోట్లో నుంచి రక్తం వస్తే అది క్యాన్సర్, లంగ్స్ లేదా టీబీ అని భయాందోళనకు గురవుతారని అన్నారు. కానీ..! తమ వద్ద నున్న అత్యాధునిక వైద్య పరికరాల సాయంతో రోగి ప్రాణాలకు ముప్పు లేకుండా చేశామన్నారు. ప్రస్తుతం అబ్జర్వేషన్‌లో ఉంచామని తొందరలోనే ఇంటికి పంపిస్తామన్నారు. సమావేశంలో యశోద హాస్పిటల్ సోమాజిగూడ బ్రాంచ్ కార్పొరేట్ రిలేషన్‌షిప్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీధర్‌రావు, మేనేజ్‌మెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వేశ్వరరావు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కదలిరండి

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఏప్రిల్ 25 : భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 27వ తేదీన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నివర్గాల ప్రజలకు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. మహా కుంభమేళాకు దండు కట్టిన మాదిరిగా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, తెలంగాణవాదులు, ఉద్యమకారులు, అన్నివర్గాల ప్రజలు తండోపతండాలుగా చేరుకుని మహనేత కేసీఆర్‌కి అపూర్వ స్వాగతం పలకాలనారు.

మే 1 నుంచి వేసవి శిబిరాలు

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 25 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుంచి 31 వరకు అండర్-14 విభాగంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల శాఖ అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు కోచ్‌లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పరీక్షాకేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 25 : జిల్లాలో ఈ నెల 27వ తేదీన జరిగే కామన్ ఎంట్రన్స్ పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లలో ఈ విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు 7 నుంచి 10 తరగతుల వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసి వేయాలని ఆదేశించారు. 200మీటర్ల పరిధిలో ఈ యాక్టు అమలు అవుతుందని తెలిపారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం

మామిళ్లగూడెం/ ఖమ్మంఅర్బన్, ఏప్రిల్ 26 : కాన్పూర్ ఐఐటీలో విద్యను అభ్యసించేందుకు ఓ నిరుపేద విద్యార్థికి స్ఫూర్తి ఫౌండేషన్ ఆర్థికసాయం అందించింది. శుక్రవారం రూ.50 వేల చెక్కును విద్యార్థి తల్లిదండ్రులకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేతులమీదుగా అందించారు. కలెక్టర్ కార్యాలయంలో కామేపల్లికి చెందిన తేజావత్ శ్రీనివాస్ తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. ఫౌండేషన్ వలంటీర్లు బాబూరావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

వలస కూలీలకు కార్మికశాఖ అండ

డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 25 : జిల్లాలో వలస కూలీలుగా పనిచేస్తున్న వారికి జిల్లా కార్మికశాఖ అండగా నిలుస్తుందని జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిర మండలం వంగవీడులో మిర్చితోటలో పని చేయడానికి మహారాష్ట్రలోని బల్లార్షా ప్రాంతానికి చెందిన పది మంది కూలీలను ఓబుల్ శ్రీనివాసరెడ్డి, బానోతు భిక్షపతి తీసుకొచ్చారని తెలిపారు. వారికి ఇవ్వాల్సిన కూలి డబ్బులు ఇవ్వకపోవడంతో బాధిత కూలీలు మధిరరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. పోలీస్ అధికారులు కార్మికశాఖ అధికారులను సంప్రదించడంతో వెంటనే స్పందించి కూలీలకు డబ్బులను యజమాని నుంచి ఇప్పించామని వివరించారు. అనంతరం వారిని బల్లార్షకు సురక్షితంగా పంపించామని తెలిపారు. జిల్లాలో వలస కూలీలను ఎవరైనా మోసం చేయాలని చూస్తే కఠినచర్యలు ఉంటామని హెచ్చరించారు.

'బీఆర్ఎస్ సభను విజయవంతం చేద్దాం'

రఘునాథపాలెం, ఏప్రిల్ 25 : హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వేదికగా ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని ఆ పార్టీ 2వ డివిజన్ ఇన్‌చార్జి చిలుమూరు కోటి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం డివిజన్ పరిధి పాండురంగాపురంలో కార్యకర్తలతో కలిసి పెద్దఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సభ వాల్‌పోస్టర్లను అంటించారు. నగర ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు హెచ్ ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు మదార్, ఉపేందర్, ఉపేంద్రాచారి, రాజు, పెద్ద మల్లేశం, నాగేంద్ర బాబు, సత్యనారాయణరెడ్డి, శేఖర్, అనిల్, సంజీవరావు, సుధాకర్, నవీన్, మధు, నిజాం, గెలమయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

కారేపల్లి, ఏప్రిల్ 25: తెలంగాణలో రాజకీయంగా తామే బలమైన శక్తిగా నిరూపించుకోవడానికి మరోసారి బీఆర్ఎస్ సిద్ధమవుతోందని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు వెళ్లేందుకు కారేపల్లి మండలం నుంచి ప్రత్యేక బస్సులు, కార్లలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలను తరలించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్, నాయకులు బానోత్ కుమార్, అడప పుల్లారావు, శివరాత్రి పాల్గొన్నారు.

కారేపల్లి, ఏప్రిల్ 25: ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభల సందర్భంగా కారేపల్లిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు తిరిగి మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. మాజీ జడ్పీటీసీలు వాంకు డొత్ జగన్, వీరేందర్, ఇస్లాపత్ బన్సీలాల్, గౌసుద్దీన్ పాల్గొన్నారు.

కొణిజర్ల, ఏప్రిల్ 25: ఈ నెల 27న వరంగల్‌లో తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. కొణిజర్లలో శుక్రవారం బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. బోడపోతుల బాబు, పాముల వెంకటేశ్వర్లు, చల్లా మోహన్‌రావు, దొడ్డపునేని రామారావు, వడ్లముడి శివ, పొట్లపల్లి జీడయ్య, రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధిర, ఏప్రిల్ 25: మదిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు, మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం, మాటూరుపేట గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ, రూరల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, పళ్లబోతుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరంగల్‌లో జరిగే రజతోత్సవ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. మొండితోక జయాకర్, మధిర రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మమత కళాశాలల గ్రాడ్యుయేషన్ డే

రఘునాథపాలెం, ఏప్రిల్ 25 : మమత వైద్య కళాశాల, దంత వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలు సంయుక్తంగా గ్రాడ్యుయేషన్ డేను శనివారం నిర్వహించనున్నట్లు మమత విద్యాసంస్థల సెక్రటరీ పువ్వాడ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముఖ్యఅతిథులుగా కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ డాక్టర్ పీవి నందకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొంటారన్నారు.

రేపు అంతర్జాతీయ నవ్వుల దినోత్సవం

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 25 : అంతర్జాతీయ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన ఖమ్మం సహకారనగర్‌లోని లైన్స్ భవన్ ఉదయం 10 గంటలకు ఆదాయ వనరులు సృష్టించడం ఎలా, ఉచిత యోగ శిక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అడ్వకేట్ మరికంటి వెంకట్ అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల్లో వరల్డ్ లాఫ్టర్ శాంతి యోగ సేవ క్లబ్స్ స్థాపించామన్నారు. సమాజంలో వ్యక్తి బలంగా ఉండాలంటే మానసిక దృఢత్వం అవసరమని, ఈ విధంగా జరగాలంటే ఎప్పుడూ నవ్వుతూ ఉండాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్స్ తాత రాఘవయ్య, గొల్లమందల నర్సయ్య పాల్గొన్నారు,

ప్రైవేట్ ఆసుపత్రిలో డీఎంహెచ్‌వో తనిఖీలు

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 25 : ఖమ్మం నగరంలోని సురక్ష ఆసుపత్రిలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓపీ, ఐపీ రిజిస్టర్లు పరిశీలించి రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నరు. అనంతరం ఆపరేషన్ థియేటర్, వార్డులను కలియతిరిగి రోగులకు అందించిన వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఆసుపత్రి అనుమతులు, స్టాఫ్ వివరాలను ఎప్పటికప్పుడు తమ కార్యాలయానికి సమర్పించాలని నిర్వాహకులను డీఎంహెచ్‌వో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాధారణ తనిఖీల్లో భాగంగానే ఆసుపత్రికి వచ్చామన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, పీవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డెమో జీ సాంబశివారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన పెద్దాసుపత్రి వైద్యులు

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 25 : పురుగుమందు తాగి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ బాలికకు ఖమ్మం పెద్దాసుపత్రి వైద్యులు ప్రాణదానం చేశారు. జిల్లా సార్వజనీన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగురోజుల క్రితం చరిత అనే పదహారేళ్ల బాలిక పాయిజన్ తీసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. వెంటనే ఆమెను ఐసీయూలో చేర్పించిన వైద్యులు అత్యవసర వైద్యసేవలు అందించారు. ఆక్రమంలోనే బాలిక గుండె కొట్టుకోవడం నిలిచిపోగా అప్రమత్తమైన వైద్యులు సీపీఆర్ పదకధతి నిర్వహించి ప్రాణాలను నిలిపారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకోగా శుక్రవారం ఇంటికి పంపించారు. తమ బిడ్డను కాపాడిన పెద్దాసుపత్రి వైద్యులకు బాలిక తల్లిండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైద్యసేవలు అందించిన వారిలో డాక్టర్ నాగేశ్వరరావు, (ఫిజీషియన్) డాక్టర్ ప్రవంతి (ఐసీయూ డీఎంవో), డాక్టర్ వినోద్ (అనస్తీషియా), నర్సింగ్ ఆఫీసర్స్ యూ రవికుమార్, పవన్‌కుమార్, బీ రవీంద్రనాయక్, ఎన్ అనూష, ఆర్ ఉపేందర్‌లో ఉన్నారు.

ఘనంగా ఆరోహన్ నేషనల్ టెక్నికల్ ఫెస్ట్

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 25 : ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరోహన్-2025 జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు, టెక్స్‌స్కై సీఈవో స్వాతి, టాస్క్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరాఖ్య, చైర్మన్ గుండాల కృష్ణలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో కృతిమ మేధస్సు అన్నిరంగాల్లో చొచ్చుకుపోతుందని, ఏఐపై విద్యార్థులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. నూతన సాంకేతిక ఆవిష్కరణలలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, కోడింగ్, క్విజ్, ట్రెజర్‌హంట్, పలు పోటీలను నిర్వహించారు. జిల్లాలోని ఇతర కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్స్‌ని సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలి

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 25 : ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందనే నమ్మకం కలిగించేలా విధివిధానాల్లో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. పద్మ, విజయ్, నాగిరెడ్డి, వెంగళరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన చైన్‌స్నాచర్

వైరాటౌన్, ఏప్రిల్ 25: స్థానిక వాసవీ కల్యాణ మండపం రోడ్డులో పట్టణానికి చెందిన మిట్టపల్లి వెంకటలక్ష్మి ఒంటరిగా నడిచి వెళ్తుండగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును చైన్‌స్నాచర్ లాక్కెళ్లారు. బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంగారు గొలుసు మూడు తులాలు ఉంటుందని చెప్పారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలంలో ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్ విచారణ చేపట్టారు. అనంతరం పోలీసులు సీసీ పుటేజ్‌ను సేకరించారు.

సైడ్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

వైరాటౌన్, ఏప్రిల్ 25: మండలంలోని సోమవరం వద్ద వైరా రిజర్వాయర్ కుడి కాల్వ దగ్గర నిర్మిస్తున్న అండర్ పాస్, సైడ్ బ్రిడ్జి నిర్మాణ పనులను తెలంగాణ